క్లుప్తంగా

మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామంలో మినీ ఫంక్షన్‌హాల్‌ను ఏర్పాటు చేయాలని, అందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు బుధవారం సర్పంచ్ బాయమ్మకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్.38లో ఉన్న 13 గుంటల ప్రభుత్వ స్థలాన్ని మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు కేటాయిస్తూ గ్రామ సభలో తీర్మానం చేయాలని వారు వినతిపత్రంలో కోరారు.

బెంచీల ఏర్పాటు



కీసర: నాగారం ఎస్వీనగర్‌కాలనీలో సీనియర్ సిటిజన్స్ ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు పార్కు స్థలంతో పాటు కాలనీ రహదారుల గుండా స్థానిక కౌన్సిలర్ కొకుట్ల మమతాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 8 బెంచీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు కొకుట్ల కృష్ణారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సర్పంచ్ అక్రమాలపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఎదులాబాద్ సర్పంచ్ సురేశ్‌పై ఆ పంచాయతీ పాలకవర్గం సభ్యులు అదనపు కలెక్టర్ అగస్త్య అభిషేక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని రేణుక సహస్ర ఇన్‌ఫ్రా వెంచర్‌లో పంచాయతీ అనుమతులు లేకుండా కట్టడాలు చేపడుతున్న వారితో కుమ్మక్కై పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నాడన్నారు. గ్రామ కంఠంలో నిర్మించిన అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేసినా సర్పంచ్, బిల్ కలెక్టర్ పట్టించుకోవడం లేదని, గ్రామంలో నిర్వహించే సమావేశాలు, గ్రామ సభల సమాచారం ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచ్, బిల్ కలెక్టర్‌పై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన వారిలో వార్డు సభ్యులు సురేశ్, ఆంజనేయులు ముదిరాజ్, బాలమణి, సరిత, భవాని, నిర్మల తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో నాగారంను ముందంజలో ఉంచుతా..



కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందంజలో ఉంచేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు సాయిశ్రీనివాసనగర్‌కాలనీలో సుమారు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అన్నం రాజు లావణ్యశ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు వెంకట్రాయుడు, కాలనీవాసులు శంకర్, దీన్‌రాజ్, శ్రీహరి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లకు వేతనాల అందజేత



ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో హిందీ, తెలుగు ఉపాధ్యాయుల కొరత ఉన్నందున జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో ఇద్దరు విద్యా వలంటీర్లను గతంలో నియమించారు. వారి డిసెంబర్ మాసం వేతనం ఒక్కరికి రూ.7వేల చొప్పున ఇద్దరికి కలిపి రూ.14 వేలు జన చైతన్య సేవా సమితి సభ్యులు సహదేవ్‌ముదిరాజ్, వీరేందర్‌యాదవ్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం అనిత పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



పోచారం: పోచారంలోని స్పటికలింగేశ్వర ఆలయంలో 18 వార్డు కౌన్సిలర్ బద్దం మమత జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 75 మంది మహిళలు పాల్గొనగా వీరిలో విజేతలుగా నిలిచిన ఐదుగురికి చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి నగదు బహుమతులను అందజేశా రు. పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులను కౌన్సిలర్ బద్దం మమత అందజేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బాలాజీనగర్‌లో గుండెపోటుతో మరణించిన సామల కృష్ణ కుటుంబీకులను చైర్‌పర్సన్ పావనీయాదవ్, జంగయ్యయాదవ్ దంపతులు మంగళవారం పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం చైర్‌పర్సన్ దంపతులు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కౌన్సిలర్ రవీందర్, ముత్యాలు, విజయ్‌ముదిరాజ్ ఉన్నారు.

కంపుకొడుతున్నా..

కనికరించరా?!

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కోరలు చాస్తున్న కాలుష్యం

- ఐదేళ్లని చెప్పి 20 ఏళ్లుగా కొనసాగుతున్న డంపింగ్‌యార్డు
- గృహకల్ప, సమీప ప్రాంతాలకు శాపం
- ఊపిరాడనివ్వని దుర్గంధం
- రంగుమారి సరఫరా అవుతున్న తాగునీరు
- రాత్రింబవళ్లు ఈగలు, దోమలతో ఇబ్బందులు
- అనారోగ్యం బారినపడుతున్న స్థానిక, పరిసర ప్రాంత వాసులు
- యువకులకు పిల్లనిచ్చేందుకు వెనుకంజ
- సమస్యలు పరిష్కరించాలని రిలే నిరహార దీక్షలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆ ప్రాంతం దగ్గరకు రాగానే ఎవరైనా సరే ముక్కు మూసుకోవాల్సిందే. తాగునీరు లభించదు. రోడ్డు సరిగా ఉండదు. ఆ కాలనీలకు పిల్లనివ్వడానికి కూడా ఎవరూ సాహసించడం లేదు. ఇంతకీ ఆ పట్టణం పేరేమిటో.. ఆ ప్రాంత ప్రజలకు వచ్చిన కష్టం ఏమిటో తెలుసుకోవాలని అనుకుంటున్నారా..? అయితే ఈ కథనం చదవండి మరి.



జవహర్‌నగర్: కాప్రా మండల పరిధిలోని జవహర్‌నగర్ వ్యవసాయానికి అనువైన ప్రాంతం. ఇక్కడి భూముల్లో బంగారం వంటి పంటలు పండేవి. ఇక్కడ చాలా మంది రైతులే ఉండే వారు. ఇదంతా గతం. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. తాగడానికి సరైన నీరులేక పోవడం, అధ్వానమైన రోడ్లు ఆహ్వానం పలుకుతున్నాయి. ఉన్నది ఒక్క రోడ్డే అయినా దానిపై మురుగునీరు ఏరులైపారుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో వ్యవసాయ బావులన్నీ కనుమరుగయ్యాయి. దాదాపు 3 లక్షల జనాభ ఉన్న పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. అంతేకాకుండా పట్టణంలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడంతో కష్టాలు ఇంకా ఎక్కువయ్యాయి. రాత్రిళ్లు వెలువడుతున్న దుర్వాసనను ప్రజలు భరించలేకపోతున్నారు. ముక్కుకు కర్చీఫ్‌లు, గుడ్డలు, మాస్కులు పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా 20 ఏళ్ల నుంచి బతుకులీడుస్తున్నట్లు ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. మరో విషయం ఏమిటంటే డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో ఉండటంతో యువకుల పెళ్లిళ్లకు పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. కొంత మంది వచ్చినా ఈ రోడ్లు, డ్రైనేజీ, డంపింగ్ యార్డును చూసి అక్కడి నుంచి యూటర్న్



డంపింగ్‌యార్డ్ కారణంగా కనుమరుగవుతున్న తాటిచెట్లు



జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్ వల్ల కలుషితమైన నీరు

తీసుకుని పారిపోతున్నారని యువకుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెద్ద పాలకవర్గంగా ఏర్పడినా...

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడి 28 కార్పొరేటర్లతో మేయర్, డిప్యూటీ మేయర్ అతిపెద్ద పాలకవర్గం ఏర్పడినా నిధులు మాత్రం అరకొరగా ఇస్తుండటంతో అభివృద్ధి పనులకు సరిపోవడం లేదని ప్రజలంటున్నారు. ఇప్పటికీ పట్టణంలో సరిగ్గా తాగునీరు సౌకర్యం కల్పించలేదని, అలాంటప్పుడు ఎలా బతికేదంటున్నారు. రోడ్ల మధ్యనే డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో నడవలేకపోతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డ్‌ను తరలించి ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఊపిరాడనంతగా దుర్గంధం..

జవహర్‌నగర్‌లోని డంపింగ్‌యార్డ్, పవర్‌ప్లాంట్‌లు ప్రజల పాలిట శాపంగా మారాయి. వీటి వల్ల జల, వాయు కాలుష్యం ఏర్పడి ముఖ్యంగా జవహర్‌నగర్, దమ్మాయిగూడ, చిర్యాల, రాంపల్లి, మల్కారం, నాగారం, తిమ్మాయిపల్లి, అహమ్మద్‌గూడ ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. క్లీన్ అండ్ గ్రీన్ నినాదంతో ప్రభుత్వం జంట నగరాల్లోని చెత్తాచెదారాన్ని సేకరించి లారీల ద్వారా తరలించి శివారు ప్రాంతమైన జవహర్‌నగర్‌లో డంపింగ్ చేస్తున్నారు. ఐదేళ్లు మాత్రమే చెత్త డంప్ చేస్తామని



ప్రారంభించిన డంపింగ్ యార్డ్ 20 ఏళ్లయినా ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇంకా కొన్నేళ్లు చెత్త వేయడానికి ప్రైవేటు కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నేడు ఈ ప్రాంతమంతా కాలుష్య జోన్‌గా మారి స్థానికంగా 20 కిలోమీటర్ల పరిధిలో నివసించే ప్రజలందరికీ అనారోగ్యాన్ని పంచుతోందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్‌యార్డ్‌తో ఈ పరిసర ప్రాంత చెరువులు, కుంటలు, బోరుబావులు, కలుషితమై జల జీవరాసుల మనుగడకు ప్రమాదకంగా మారింది. జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం చెత్త డంపింగ్‌యార్డ్ ఒకే చోట ఐదేళ్లకు మించి ఉండరాదు. కానీ జవహర్‌నగర్‌లో డంపింగ్ ఏర్పాటు చేసి పదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం కానీ, అధికారులుగానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.



నగరం నుంచి వందల టన్నులకు పైగా చెత్తను ఈ ప్రాంతంలోనే డంప్ చేస్తున్నారు. దీని వల్ల వాయు కాలుష్యం ఏర్పడి చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలు కళ్ల మంటలు, ఇతర జబ్బులతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ డంపింగ్‌యార్డ్‌లో కాలిన చెత్త ద్వారా వెలువడే చమురులాంటి ద్రవ పదార్థాలు భూమిలోకి ఇంకి పరిసర ప్రాంతాల్లోని చెరువులు, బోరు బావుల్లోకి ఇంకిపోతున్నాయి. దీంతో ఆయా చెరువుల్లో ఉండే జీవరాసులు ఆ నీటిని తాగుతున్న జంతువులు, పక్షులు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డ్‌ను దూర ప్రాంతాలకు తరలించి ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

జ్వరాలతో జనం...



డంపింగ్‌యార్డ్ వల్ల కలుషితమైన నీరు

జవహర్‌నగర్ పరిసర గ్రామాల ప్రజలు ప్రస్తుతం వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ప్రతీ కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు జ్వరం బారిన పడుతున్నారు. బోరునీరు కలుషితమై చర్మ సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. చెత్త వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. పగలు ఈగలు, రాత్రి దోమల బెడదతో జనం విలవిల్లాడుతున్నారు. మలేరియా, దగ్గు, జలుబు, జ్వరం, వాంతులు, విరేచనాలు లాంటి వ్యాధులు సోకుతున్నా అధికారులు, వైద్య బృందం పట్టించుకున్న దాఖలాలు లేవు.

వారం రోజులుగా నిరహార దీక్షలు...

స్థానిక సమస్యలను పరిష్కరించాలని కార్మికనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు వారం రోజులుగా నిరహారదీక్షలు కొనసాగిస్తున్నారు. వీరికి మద్దతుగా పలు రాజకీయ పార్టీల నాయకులు పూర్తిస్థాయి మద్దతు ప్రకటించాయి.



కార్మికనగర్‌లో నిరాహార దీక్ష చేస్తున్న స్థానిక ప్రజలు

జ్వరాలు పీడిస్తున్నాయి..



చెత్త డంపింగ్ యార్డ్ పక్కనే ఉన్న మా కాలనీలో సుమారు వందల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇందులో చాలా కుటుంబాల వారు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఎన్ని మాత్రలు వేసుకున్నా జ్వరాలు తగ్గడం లేదు. రాత్రి దోమలతో పగలు ఈగలతో సహవాసం చేస్తున్నాం. మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వారం రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– కేతమ్మ, కార్మికనగర్, జవహర్‌నగర్

'పిల్లనివ్వాలంటే భయపడుతున్నారు'



ఈ మధ్య కాలంలో మా బంధువుల ఇంటికి సంబంధం చూడటానికి కొందరు వచ్చి వెళ్లారు. సమాధానం చెప్పకపోవడంతో ఏమిటా అని ఆరా తీస్తే అసలు విషయం బయటపడింది. కాలనీలు కంపుకొడుతున్నాయని, సరైన సౌకర్యాలు లేవని పిల్లనివ్వడానికి ఒప్పుకోవడం లేదు. నగరానికి దగ్గరలోనే ఉన్నప్పటికీ ఎలాంటి సదుపాయాలు లేవు.

– దామాల ప్రభాకర్‌రావు, కార్మికనగర్, జవహర్‌నగర్

పవర్‌ప్లాంట్‌తో పరేషాన్...



గత నాలుగేళ్ల క్రితం డంపింగ్ యార్డ్‌లో పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో శబ్ద కాలుష్యంగా ఏర్పడుతుంది. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో నివసించలేకపోతున్నాం. డంపింగ్ యార్డు కలుషిత నీరు తాగి పశువులు, పక్షులు మరణిస్తున్నాయి. ఇక్కడి ప్రజలంతా రోగాల బారినపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలి.

– జావెద్, వైఎస్సార్‌నగర్, జవహర్‌నగర్

మునీరాబాద్‌ను సందర్శించిన లడాక్ బృందం

మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామాన్ని బుధవారం లడాక్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుల బృందం సందర్శించింది. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం అనంతరం గ్రామానికి వచ్చిన 30 మంది సభ్యులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పల్లె ప్రకృతివనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న పనుల వివరాలను గురించి గ్రామ సర్పంచ్ గణేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు వాటి పనితీరును అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.5 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు రాగజ్యోతి, డీపీఓ రమణమూర్తి, ఎంపీఓ వినూత్న, ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



స్థానిక ప్రజా ప్రతినిధులతో లడాక్ సభ్యులు

'మూగజీవిపై మల్లన్న మానవత్వం'

- స్తంభం మధ్యలో ఇరుక్కున్న ఆవు
- సెక్యూరిటీ సాయంతో బయటకు తీసిన మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: స్తంభం మధ్యలో ఇరుక్కున్న ఓ మూగజీవిని బయటకు తీసి మానవత్వం చాటుకున్నాడు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి. జవహర్‌నగర్‌లో ఒడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ అనంతరం బయల్దేరి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రక్కన ఉన్న ఓ స్తంభం వద్ద ఆవు మెడ ఇరుక్కుని కనిపించింది. విషయాన్ని గమనించిన మంత్రి తన కాన్వాయ్‌ని ఆపి సెక్యూరిటీ సాయంతో ఇబ్బందుల్లో ఉన్న ఆవును బయటకు తీసాడు. దీంతో మానవత్వంతో మంత్రి ఆవును విడిపించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



సొంత శాటిలైట్ ప్రయోగానికి ఏయూ సిద్ధం

అనురాగ్ యూనివర్సిటీ ఉప కులపతి రామచంద్రం

ఘట్‌కేసర్: మిషన్-2023లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో సొంత శాటిలైట్-అనురాగ్‌శాట్‌ను ప్రయోగించనుందని అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ) ఉప కులపతి రామచంద్రం అన్నారు. వెంకటాపూర్ ఏయూలో మంగళవారం అనురాగ్ సెట్-2023 (ఇంజినీరింగ్, వ్యవసాయం)ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏయూ సీఈఓ నీలిమా, రిజిస్ట్రార్ పాతిమా, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ శ్రీనివాస్‌రావు, డీన్, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



అనురాగ్ సెట్-2023ని ఆవిష్కరిస్తున్న వీసీ రామచంద్రం, సీఈఓ నీలిమా తదితరులు

మల్లారెడ్డి యూనివర్సిటీలో 'వాల్తేరు వీరయ్య' టీం సందడి

– చిత్రంలోని ఓ పాట విడుదల



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బుధవారం వాల్తేరు వీరయ్య చిత్ర బృందం సందడి చేసింది. యూనివర్సిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డితో పాటు చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్, డైరెక్టర్ బాబీ, కొరియోగ్రాఫర్ శేఖర్‌మాస్టర్, నిర్మాత రవింద్రలు పాల్గొని విద్యార్థుల కేరింతల మధ్య వాల్తేరు వీరయ్య చిత్రంలోని 'నీకేమో అందమెక్కువ' పాట విడుదల చేశారు. పాట ఆడియో, వీడియోలను విడుదల చేసి ఈ సందర్భంగా చిత్ర బృందం విద్యార్థులతో కలిసి స్టెప్పులేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి కుటుంబీకులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, శాలినిరెడ్డి, ప్రీతిరెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్ చౌరస్తాలో వడ్డెర సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు శివరాత్రి వెంకటేశ్ ఆధ్వర్యంలో వడ్డెరుల ఆరాధ్యుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి బిక్షమయ్య, ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్, రవి, సభ్యులు మహేశ్, శ్రీకాంత్, రంజిత్, సత్తయ్య, మైసయ్య, ప్రసాద్, గురువయ్య, బాలమల్లేశ్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలి

– అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డి



సాక్షి, మేడ్చల్‌జిల్లా: కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తమకు అప్పగించి విధులను నిర్వహించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్(లోకల్‌బాడీస్) అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి గణతంత్ర దినోత్సవ వేడుకలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లపై అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ హరీష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్నందున అందుకు అనుగుణంగా వేదిక, బారికేడ్లు, బయటికి, లోపలికి వెళ్లే దారిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వేడుకలకు హాజరుకానున్న అతిథులకు పోలీస్ గౌరవ వందనంతో పాటు బందోబస్తు తదితర విషయాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పేట్ బషీర్‌బాగ్ ఏసీపీ రామలింగరాజు, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమస్యలు రాకుండా చూసుకోవాలి

ఘట్‌కేసర్: విద్యార్థులకు ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాలని, సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని ఉర్దూ మీడియం స్కూల్‌ను మంగళవారం వారు సందర్శించి పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉందన్న ఉపాధ్యాయుల విన్నపం మేరకు డోజర్‌తో చదును చేయించారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మమత, అఖిల, రాందాసు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణను చదును చేయిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి

పండుగకు ఊరెళ్తున్నారా? జాగ్రత్త!



జవహర్‌నగర్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో వారి సొంతూర్లకు వెళ్లే వారు చాలా జాగ్రత్తగా ఉండాలని జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్ సూచించారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఆటోలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ సొంతూర్లకు దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్లను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలపాలన్నారు. అనుమానాస్పద వాహనాల్లో ప్రయాణించవద్దన్నారు. ఇంట్లోని బంగారు నగలు, నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, మోహన్, రాంబాబు, పోలీసులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ వేదికపై జీ-20 గ్రూపింగ్ సమావేశానికి భారత్ అధ్యక్ష హోదాలో ఉండటంతో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు ఆధ్వర్యంలో బుధవారం జీ-20 ముగ్గులు వేసిన కౌన్సిలర్లు హంసరాణికృష్ణగౌడ్, సరస్వతి మోహన్‌రెడ్డి, నవనీత, రజని, త్రివేణి, రేఖ, శశికళ, అర్జున్‌బాబు తదితరులు. - మేడ్చల్

ఓబన్న ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణలో మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: బ్రిటీష్ నిరంకుశత్వాన్ని ఎదిరించిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఒడ్డె ఓబన్న 216వ జయంతిని పురస్కరించుకుని బుధవారం జవహర్‌నగర్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓబన్న విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. వడ్డెరుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని కట్టుబడి ఉందని, జవహర్‌నగర్‌లో వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కుతాడి శ్రీనివాస్, మేకల అయ్యప్ప, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఒడ్డెర సంఘం నాయకులు వెంకటేష్, రవి, సుబ్రహ్మణ్యం, నర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి